సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం, 22, మే, 2023



నిండుకుండలా మూసీ

మండు వేసవిలోనూ మూసీ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. గరిష్ట స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. - 8లో



యువత కృషి..

ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగుల కోసం కూరెళ్ల యువత గ్రంథాలయం ఏర్పాటు చేసింది. - 9లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40° / 27°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రెండు ఫుడ్ కోర్టులు మంజూరు

భువనగిరిటౌన్ : జిల్లాకు రెండు ఫుడ్ కోర్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని జనం ఎక్కువగా తిరిగే ప్రాంతాలైన యాదగిరిగుట్ట ఆర్టీసీ బస్టాండ్, భువనగిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేయనున్నారు. 10 రోజుల్లో అందుబాటులోకి తెచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటికి సంబంధించి పూర్తిస్థాయి గైడ్‌లెన్స్ త్వరలో రానున్నాయని, వీటి ఏర్పాటుకు 100 గజాల చొప్పున స్థల సేకరణ కూడా చేసినట్లు మత్స్య శాఖ జిల్లా అధికారి రాజారాం తెలిపారు. ఫుడ్ కోర్టుల్లో చేపల కూరతో కూడిన భోజనం విక్రయిస్తారని, ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలు ఉంటాయన్నారు. మత్స్య సహకార సంఘానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు.

భువనగిరిలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత



భువనగిరిటౌన్ : భానుడి భగభగలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం అత్యధికంగా భువనగిరిలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో 43.3, మోత్కూరులో 42 డిగ్రీలు, అత్యల్పంగా అడ్డగూడూరు మండలంలో 37.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గుండాల, అలేరు ఎల్లో జోన్, మిగతా మండలాలు ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

ఈదురుగాలులుల బీభత్సం



రైతు శ్రీనివాస్ నిమ్మతోటలో కూలిన చెట్లు

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో కొండాపురంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గ్రామానికి చెందిన బీసు శ్రీనివాస్ అనే రైతు నిమ్మతోటలో సుమారు 40 చెట్లు కూకటి వేళ్లతో కూలిపోయాయి. చెట్లపై చేతికొచ్చిన కాత ఉందని, ఈదురుగాలుల కారణంగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



కేసుల వివరాలు తెలుసుకుంటున్న జడ్జి

చౌటుప్పల్ : కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలని చౌటుప్పల్ కోర్టు న్యాయమూర్తి మహతి వైష్ణవి సూచించారు. జూన్ 10వ తేదీన నిర్వహించనున్న మెగాలోక్ అదాలత్‌పై స్థానిక కోర్టులో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. కక్షిదారులు సత్వర న్యాయం పొందే విధంగా పోలీస్‌శాఖ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇరువురు రాజీపడే విధంగా అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌పై ప్రచారం కల్పించాలన్నారు. సమావేశంలో కోర్టు సూపరింటెండెంట్ అశోక్, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, పోచంపల్లి మండలాల పోలీసులు, బెంచ్‌క్లర్క్ ఉమర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్‌రావు



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌రావు

భువనగిరి : తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్- 327 రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా భువనగిరి పట్టణానికి చెందిన బండారు శ్రీనివాస్‌రావు ఎన్నికయ్యారు. ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన ఆ సంఘం ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీనివాస్‌రావును యూనియన్ నాయకులు శ్రీనివాస్ ,నర్సింగ్‌రావు, మహేష్‌లు అభినందించారు.



శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన గావించి తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు నిర్వహించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఐదేళ్లుగా నిరీక్షణ!

అర్హులందరికీ అందని బీసీ కార్పొరేషన్ రుణాలు
- 14,181 మంది దరఖాస్తు
- 11,110 మంది అర్హులుగా గుర్తింపు
- కేవలం 552 మందికే రూ.50 వేల రుణాలు మంజూరు
- పెండింగ్‌లో 10 వేలకు పైగా దరఖాస్తులు



ఈయన పేరు ఎలగందుల శ్రీనివాస్. రాజాపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్. వికలాంగుడైన శ్రీనివాస్ ఫొటోగ్రఫీ వృత్తిని ఎంచుకుని స్వయం ఉపాధి పొందుతున్నాడు. ఆధునాతన కెమెరా, ఇతర పరికరాలు కొనుగోలుకు 2017లో రూ.2లక్షల రుణం కోసం బీసీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 2018లో సీఎం కేసీఆర్ బీసీలకు రుణాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో మరోసారి రూ.5లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు, బ్యాంకు సిబ్బంది గ్రామసభ నిర్వహించి రుణానికి ఎంపిక చేశారు. అయితే రూ.5లక్షల రుణం ఇవ్వలేమని, పూర్తి సబ్సిడీతో రూ.50వేలు ఇస్తామని చెప్పడంతో అందుకు అంగీకరించాడు. అయినా ఇంత వరకు ఆర్థిక సహాయం అందలేదు. తాజాగా వికలాంగులకు రుణాలు ఇస్తామంటే దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందని శ్రీనివాస్ వాపోతున్నాడు. వివిధ కేటగిరీల్లో దరఖాస్తు చేసుకున్న వారంతా ఇతని మాదిరిగానే ఎదురుచూస్తున్నారు.



భువనగిరిలోని బీసీ కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి, యాదాద్రి: ప్రభుత్వం అందించే బీసీ కార్పొరేషన్ రుణాల కోసం లబ్ధిదారులు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. 2018లో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రుణాలు ఇస్తామనడంతో జిల్లాలో అర్హులైన వారంతా బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లతోపాటు వ్యక్తిగత రుణాల కోసం వేలల్లో దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో అధికారులు చేతివాటం ప్రదర్శించి అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేయడంతో అర్హులకు రుణాలు అందకుండాపోయాయనే విమర్శలు వెల్లువెత్తాయి. రుణాలు అందని వారంతా నేటికీ బీసీ సంక్షేమ అధికారులు, మండల పరిషత్ కార్యాలయాలు, పంచాయతీ కార్యదర్శుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

దరఖాస్తులు, రుణాల మంజూరు

జిల్లాలో బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లతోపాటు వ్యక్తిగత రుణాల కోసం 14,181మంది దరఖాస్తులు చేసుకోగా ఇందులో 11,110మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో కేవలం 552 మందికే పూర్తి సబ్సిడీపై రూ.50వేల చొప్పున రుణం మంజూరు చేశారు. అయితే ఇంకా 10,558మంది కార్పొరేషన్ రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇందులో రూ.లక్ష లోపు రుణాల కోసం 1301, రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల రుణాల కోసం 4112, రూ.ఐదు లక్షల రుణాల కోసం 2,145మంది దరఖాస్తు చేసుకున్నారు. రూ.లక్ష రుణం తీసుకుంటే 80శాతం, రూ.రెండు లక్షల రుణం తీసుకుంటే 70శాతం, రూ.రెండు లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకుంటే 50శాతం సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే బ్యాంకులతో సంబంధం లేకుండా రూ.50వేల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందజేసేలా కొత్త రుణ పథకాన్ని 2018 ఆగస్టు 15న ముఖ్యమంత్రి ప్రారంభించారు. పథకం ప్రారంభించిన తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ప్రక్రియ ఆగిపోయింది. అంత వరకు గ్రామసభలు నిర్వహించి రూ.50వేల ఆర్థిక సహాయం పంపిణీకి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇక్కడ పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయి. స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రకటించిన రూ.5లక్షల వరకు సబ్సిడీ రుణం ఇంత వరకు మంజూరు కాలేదు. అయితే రూ.లక్ష వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి మాత్రం రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మిగతా వారికి నేటికీ అతీగతి లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గతంలో ఎంపిక చేసిన తమకు రుణాలు అందజేసి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

దరఖాస్తుల వివరాలు

దరఖాస్తులు	అర్హులు	రూ.లక్ష	రూ.3 లక్షలు	రూ.5 లక్షలు
7,096	7,033	526	1,848	1,107
ఎంబీసీ కార్పొరేషన్‌కు				
581	318	57	205	56
సమాఖ్యల వ్యక్తిగత రుణాలకు				
6,504	3,759	718	2,059	982

లోను వచ్చిందన్నారు.. కార్యాలయానికి వెళ్తే రాలేదన్నరు



రూ.50 వేల రుణంకోసం దరఖాస్తు చేశాను. నాకు అధికారులు ఫోన్ చేసి రుణం మంజూరైందని చెప్పారు. వెంటనే భువనగిరికి వెళ్లి అడిగితే నీకు రాలేదదని చెప్పారు. రుణాల మంజూరులో ముందు వికలాంగులకు అవకాశం ఇవ్వాలని నిబంధనలు ఉన్నా పాటించడం లేదు. బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరిగి లాభం లేదని ఊరుకున్నాను. రుణాల మంజూరు పేరుతో నాలాంటి వారికి ఆశ పెట్టి మోసం చేస్తున్నారు. – తాటి ఆంజనేయులు, పొట్టిమర్రి, రాజాపేట మండలం

అధికారుల చుట్టూ తిరిగినా రుణం ఇవ్వలేదు

బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల రుణం ఇస్తామంటే 30 మంది వరకు వడ్రంగి, మనుమయవృత్తిదారులం దరఖాస్తు చేసుకున్నాం. రుణం వస్తుందంటే శ్రీ వీరబ్రహ్మేంద్ర మనుమయ సహకార సంఘం, ఆలేరు పేరుతో రెండు సంఘాలు నల్లగొండలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. నాలుగేళ్లు భువనగిరి బీసీ కార్పొరేషన్ అధి కారుల చుట్టూ తిరిగాం. బ్యాంకులో జమానత్ కావాలంటే కూడా ఇప్పించాం. అయినా రుణం మంజూరు కాలేదు. – కోలోజు భీష్మాచారి, ఆలేరు

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి



గుర్రపుతండాలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి మహేంద్రనాథ్ పాండే

- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే

చందంపేట : ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్ కుటుంబ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే పేర్కొన్నారు. ఆదివారం నేరెడుగొమ్ము మండలంలోని గుర్రపుతండాలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సీఎం అయ్యాక వెనుకబడిన ప్రాంతాలైన చందంపేట, నేరెడుగొమ్ము ప్రాంతాల్లో ఒక్క ఎకరానికైనా సాగు నీరు అందించారా అని ప్రశ్నించారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని చెప్పి విస్మరించారని, రూ.లక్ష రుణమాఫీ చేస్తానని చెప్పి ఇంతవరకు చేసిన పాపాన పోలేదన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. దళితబంధు మాదిరిగా గిరిజనబంధు కూడా అమలు చేసి గిరిజనులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక.. భారతదేశాన్ని విశ్వ గురువుగా తయారు చేశారని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలో కోటి మంది గిరిజనులు ఉన్నారని, వారి సమస్యలను ప్రధాని మోదీకి వివరించి.. పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.



డిండిలో చేపల వ్యాపారులతో మాట్లాడుతున్న మంత్రి మహేంద్రనాథ్ పాండే

వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

డిండి : రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి, నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ మహేందర్‌నాథ్ పాండే కోరారు. పార్లమెంట్ ప్రభాస్ యోజనలో భాగంగా ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ నుంచి నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని నక్కలగండి ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న ఆయనకు డిండి ప్రాజెక్టు వద్ద బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం డిండి ప్రాజెక్టు వద్ద చేపలు విక్రయిస్తున్న మహిళలతో మంత్రి మాట్లాడారు. స్థానికంగా చేపల మార్కెట్ లేకపోవడంతో రోడ్డు వెంట చేపలు విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రాగానే డిండి మండల కేంద్రంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి రవీందర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, లాలూనాయక్, కళ్యాణ్‌నాయక్, చెనమోని రాములు, గుండాల అంజయ్య, సాగర్, బహదూర్‌సింగ్, వానం నరేందర్‌రెడ్డి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

రాజీవ్ ఆన్‌లైన్ క్విజ్‌ను విజయవంతం చేయాలి

భువనగిరిటౌన్ : హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు క్విజ్ పోటీల్లో విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్ తెలిపారు. ఆదివారం ఆయన భువనగిరిలో విలేకర్లతో మాట్లాడారు. 16నుంచి 35 ఏళ్ల మధ్య వయసు లోపువారు పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు జూన్ 1వ తేదీ లోపు 7661899899కు మిస్డ్ కాల్ ఇచ్చినట్లయితే వారి ఫోన్‌కు వెబ్ లింక్ వస్తుందన్నారు. లింక్ ద్వారా తమ పేరును నమోదు చేసుకొని ఓటీపీ ద్వారా 0097 రిఫరల్ కోడ్ ఎంటర్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 2వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 60 ప్రశ్నలతో క్విజ్ పోటీ ఉంటుందన్నారు. ఈ పోటీలో గెలిచిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురుపంగ చందు, జిల్లా కార్యదర్శి పాండాల శరత్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి జన్మదినోత్సవానికి భారీ ఏర్పాట్లు

- 23న బి.వెల్లెంల ప్రాజెక్టు వద్ద నిర్వహించేందుకు సన్నాహాలు
- తరలిరానున్న కార్యకర్తలు, అభిమానులు, రైతులు



బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్ వద్ద సిద్ధమవుతున్న సభా వేదిక

నార్కట్‌పల్లి : భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పార్టీ కార్యకర్తలు సన్నద్ధం అవుతున్నారు. ఈ నెల 23న నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్ వద్ద 60వ పుట్టినరోజు నిర్వహించేందుకు కాంగ్రెస్ నాయకులు బత్తుల ఉషయ్య, వడ్డె భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

2009లో బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పనులు ప్రారంభం

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వగ్రామం అయిన బ్రాహ్మణవెల్లెంల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఉదయసముద్రం - బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుకు రూపకల్పన చేయించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా 2007లో బ్రాహ్మణవెల్లెంల సమీపంలో ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన చేయించారు. రూ.699 కోట్ల అంచనా వ్యయంతో 2009లో పనులు ప్రారంభం అయ్యాయి. ఈ ప్రాజెక్టు ద్వారా ఎనిమిది మండలాల పరిధిలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు పనులు ప్రస్తుతం తుది దశకు చేరాయి. 14 సంవత్సరాలకు ట్రయల్ రన్ నిర్వహించారు. బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌లోకి నీరు వచ్చింది. ఈ ఆనంద సమయంలో ఈ ప్రాంతంలోని రైతాంగం, ప్రజల సమక్షంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు వద్ద నిర్వహించేందుకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

500 కార్లతో భారీ కాన్వాయ్..

23వ తేదీ ఉదయం 9గంటలకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైదరాబాద్ నుంచి నార్కట్‌పల్లికి చేరుకుంటారు. అనంతరం సుమారు 500 కార్ల భారీ కాన్వాయ్‌తో బి.వెల్లెంల రిజర్వాయర్ వద్దకు చేరుకోనున్నారు. అక్కడ కృష్ణా జలాలకు పూజలు చేయనున్నారు. అనంతరం సభా వేదిక వద్ద కేక్ కట్ చేసి సభకు హాజరమ్యే కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. వేసవికాలం దృష్ట్యా సభకు వచ్చే కార్యకర్తలు, అభిమానులు ఇబ్బంది పడకుండా టెంట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. 30 వేల మందికి అన్నదానం చేయనున్నారు.

కోమటిరెడ్డి 16 ఏళ్ల కృషి ఫలించింది



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 16 ఏళ్ల కల నేరవేరింది. అందుకోసమే ఆయన జన్మదిన వేడుకలను ఈ ప్రాంత రైతుల మధ్య నిర్వహిస్తున్నాం. వైఎస్సార్‌ను ఒప్పించి బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు సాధించారు. ఇన్నాళ్లకు కోమటిరెడ్డి కల ఫలించింది.

– బత్తుల ఊషయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, నార్కట్‌పల్లి

ఏర్పాట్లు చేస్తున్నాం



కోమటిరెడ్డి జన్మదినం సందర్భంగా బి.వెల్లెంల ప్రాజెక్టు వద్దకు వస్తున్న వెంకట్‌రెడ్డి అభిమానులు, కార్యకర్తలు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. నీటి సౌకర్యంతోపాటు భోజన వసతి కల్పిస్తున్నాం.

– వడ్డే భూపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్, ఎల్లారెడ్డిగూడెం

ఉద్యోగార్థులకు పఠన కేంద్రాలు

- జిల్లాకు పది పబ్లిక్ రీడింగ్ రూంలు మంజూరు
- ఇప్పటికే సింగన్నగూడెంలో ఏర్పాటు
- మిగతావి వారం, పది రోజుల్లో అందుబాటులోకి



భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ రీడింగ్ రూం

భువనగిరి : ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న యువతకు ఉపయోగపడేలా జిల్లాలో పబ్లిక్ రీడింగ్ రూంలు ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీల్లో ఏర్పాటుకు జిల్లా గ్రంథాలయ సంస్థ చర్యలు చేపట్టింది. వీటిల్లో కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు అవసరమైన స్టడీ మెటీరియల్, దినపత్రికలను అందుబాటులో ఉంచనున్నారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా భువనగిరి పట్టణ పరిధి సింగన్నగూడెంలో ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మరో తొమ్మిది పబ్లిక్ రీడింగ్ రూంలు ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్వహణకు జిల్లా గ్రంథాలయ సంస్థ నిధులు ఖర్చు చేయనుంది.

నిర్వహణకు నెలకు రూ. 2వేలు

భవనం మరమ్మతులకు రూ.లక్ష, ఫర్నిచర్‌కు రూ.40వేలు, పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలుకు రూ.10వేలు. మొత్తం రూ.లక్షన్నర జిల్లా గ్రంథాలయ సంస్థ ఇవ్వనుంది. అలాగే నిర్వహణకు గాను ప్రతి నెలా రూ. 2వేల చొప్పున ఇవ్వనుంది. ఆ మొత్తం గౌరవ వేతనం కింద ఉద్యోగికి రూ.వెయ్యి, మిగిలిన రూ.వెయ్యితో దినపత్రికలు కొనుగోలు చేస్తారు.

నిరుద్యోగులకు తప్పనున్న ఇబ్బందులు

జిల్లాలో ప్రస్తుతం 16 గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో గ్రేడ్-1 ఒకటి, గ్రేడ్ - 3 గ్రంథాలయాలు 15 ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన మోటకొండూరు, అడ్డగూడూరు తప్ప మిగిలిన అన్ని మండల కేంద్రాల్లో గ్రంథాలయాలు ఉన్నారు. వీటితో పాటు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న యువత కోసం పబ్లిక్ రీడింగ్ రూమ్ పేరుతో మరో 10 ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం మోటకొండూరు, అడ్డగూడూరుతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పబ్లిక్ రీడింగ్‌ల అవసరం ఉంది. వీటి ఏర్పాటుతో నిరుద్యోగ యువత పట్టణ, దూర ప్రాంతాలకు వెళ్లవల్సిన అవసరం తప్పుతుంది.

వారం రోజుల్లో పూర్తి

జిల్లా వ్యాప్తంగా 10 పబ్లిక్ రీడింగ్ రూంల ఏర్పాటు కోసం కసరత్తు ప్రారంభించాం. ఇప్పటికే భువనగిరి పట్టణంలోని సింగన్నగూడెంలో ఏర్పాటు చేశారు. మిగతావన్నీ వారం, పది రోజుల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులకు రీడింగ్ రూంలు ఎంతో ఉపయోగపడనున్నాయి.

– సుధీర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

హనీఫ్ అహ్మద్‌కు పురస్కారం



గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ పురస్కారం అందుకుంటున్న హనీఫ్ అహ్మద్

వలిగొండ : మండలంలోని వర్కట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు హనీఫ్ అహ్మద్ కు గాంధీ గ్లోబల్ ఫ్యావిఎటీ పురస్కారం దక్కింది. మహాత్మాగాంధీ బోధనలపై విస్తృత ప్రచారం చేస్తున్నందుకు గాను పురస్కారానికి ఎంపికయ్యారు. హైదారాబాద్‌లోని మినిస్టర్స్ క్వాటర్స్ క్లబ్ హౌజ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ప్రతిష్టాన్ చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, యానాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గడ్డి వాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట) : ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని గడ్డి వాము దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని రామోజీ తండాలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన గుగులోతు టీక్యాకు చెందిన గడ్డివాముకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారుగా రూ. 50 వేల విలువ చేసే గడ్డి దగ్ధమైనట్టు బాధిత రైతు తెలిపాడు.

కబేళాకు తరలిస్తున్న గోవుల పట్టివేత



పట్టుబడిన గోవులు

చింతపల్లి : మల్లేపల్లి వైపు నుంచి హైదరాబాద్ వైపునకు కబేళాకు తరలిస్తున్న గోవుల వాహనాన్ని ఆదివారం భజరంగ్‌దళ్ కార్యకర్తలు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ అక్రమంగా గోవులను తరలిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టుబడిన ఎనిమిది గోవులను వెల్దండ గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఎస్ఐ తెలిపారు.

వాట్సాప్ గ్రూప్ ద్వారా పశువుల ఆచూకీ లభ్యం



వాట్సాప్ గ్రూప్ చూస్తున్న రైతులు

అర్వపల్లి: ఓ వాట్సాప్ గ్రూప్ ద్వారా తప్పిపోయిన పశువుల ఆచూకీ లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన రైతు గద్దగూటి మల్లయ్యకు చెందిన రెండు చొప్పున ఆవులు, కోడె దూడలు 4రోజుల క్రితం తప్పిపోయాయి. అయితే, ఆ పశువుల కోసం రైతుతో పాటు ఆయన బంధువులు నియోజకవర్గం అంతా వెతికినా జాడ దొరకలేదు. మండల పరిధిలోని కాసర్లపహాడ్‌లో ఈ పశువులు తిరుగుతుండగా గ్రామానికి చెందిన రైతు రవికుమార్ వాటిని చూసి తన సెల్‌లో ఫోటోలు తీసి మన ఊరు కాసర్లపహాడ్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశాడు. అయితే, పశువులు తప్పిపోయిన రైతు మల్లయ్య ఆదివారం అర్వపల్లిలో పశువుల కోసం వెతుకుతుండగా కాసర్లపహాడ్ గ్రూప్‌లో సెండ్ చేసిన ఫొటోలను స్థానికులు చూయించగా అవి తమ వేనని గుర్తించాడు. వెంటనే గ్రామానికి వెళ్లి నల్లగుంట్ల రవికుమార్‌ను కలిసి గ్రామంలో తప్పిపోయి తిరుగుతున్న పశువులను గుర్తించి తిరిగి గ్రామానికి తోలుకపోయారు. గ్రూప్‌లో పశువుల ఫొటోలను సెండ్ చేసిన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిండుకుండలా మూసీ

- ఎగువ నుంచి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- పూర్తిస్థాయి నీటి మట్టానికి మూడున్నర అడుగుల దూరంలో ప్రాజెక్టు
- ఆనందంలో ఆయకట్టు రైతులు



నీటితో కళకళలాడుతున్న మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి: ఎండలు మండుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మూసీ ప్రాజెక్టు నీటితో నిండికుండలా తొణికిసలాడుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జున సాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు ఈఏడాది నీటితో కళకళలాడుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరువలోకి వచ్చింది. 2022–23 సీజన్‌లో వానాకాలం, యాసంగిలో(రెండు పంటలకు) సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పరిధిలోని దాదాపు 35వేల ఎకరాల ఆయకట్టు భూముల్లో పంటల సాగుకు కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. యాసంగి సీజన్ పంటకాలం పూర్తయిన తర్వాత ఏప్రిల్ 10న సాగు నీటిని విడుదల చేసే సమయానికి 645 అడుగులు గరిష్ట నీటిమట్టం గల మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం 622 అడుగులకు తగ్గిపోయింది.

గతంలో ఒకే పంటకు..

మూసీ ప్రాజెక్టు రిజర్వాయర్ పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడి నిండుతుంది. దీంతో ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కేవలం ఒకే పంటకు వారబందీ పద్ధతిలో ఆరుతడి పంటలకు మాత్రమే నీటిని విడుదల చేసేలా డిజైన్ చేసి నిర్మించారు. వానాకాలం సీజన్‌లో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసే వర్షాలకు ప్రాజెక్టు నిండితే యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు డిసెంబర్ మాసంలో వారబందీ పద్ధతిని నీటిని విడుదల చేసేవారు. కానీ ఐదారేళ్లుగా వేసవి కాలంతో పాటు, వానాకాలం ప్రారంభంలోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో మూసీ రిజర్వాయర్‌లో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరుతుంది. దీంతో యాసంగితో పాటు వానాకాలం సీజన్‌లో కూడా ఆయకట్టులో రెండు పంటల సాగుకు నీటిని విడుదల చేస్తున్నారు.

20అడుగులు పెరిగిన నీటిమట్టం

గత ఏప్రిల్ మాసం నుంచి మూసీ ఎగువ ప్రాంతాలైన హైదరాబాద్ నగరంతో పాటు వరంగల్, జనగాం ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ, బిక్కేరు వాగుల ద్వారా నిరంతరాయంగా నీరు వస్తుండటంతో వేసవిలో ప్రాజెక్టులో నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 641.75 అడుగులకు చేరుకుంది. అంటే గత ఏప్రిల్ నుంచి నేటి వరకు దాదాపు 20అడుగుల మేర నీరు చేరింది. గరిష్ట నీటిమట్టానికి కేవలం మూడున్నర అడుగుల దూరంలో మాత్రమే ఉంది. ఎగువ నుంచి 633 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.63 టీఎంసీల నీరు నిల్వ ఉంది . మూసీ ఎగువ, పరీవాహక ప్రాంతాల్లో తొలకరి వర్షాలు కురిసి ఏ మాత్రం ఇన్‌ఫ్లో పెరిగినా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ప్రాజెక్టు గేట్లు ఎత్తే అవకాశముంది. వానాకాలం సీజన్‌లో ఆయకట్టులో పంటల సాగుకు నీటి విడుదలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వస్తే ఆమేరకు సకాలంలో సాగు పనులు మొదలు పెట్టవచ్చని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు పంటలకు సిద్ధమవుతున్న



"మూసీ ఆయకట్టు కింద నాకున్న రెండెకరాల భూమితో పాటు మూడు ఎకరాలు కౌలుకు చేస్తున్నా. గతంలో ఏటా ఒక పంటగా వరి సాగు చేసేవాన్ని. ఐదారేళ్ల నుంచి రెండు పంటలు సాగు చేస్తున్నాను. ఈసారి కూడా రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉంది. వానాకాలం, యాసంగిలో పంటలు సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా.

– పదాల లింగయ్య, రైతు, కేతేపల్లి

గేట్ల నిర్వహణ పనులు పూర్తి చేశాం



"ప్రస్తుత వేసవిలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. నీటి మట్టం గరిష్టస్థాయికి చేరువలోకి రావటంతో గేట్ల నిర్వహణ పనులను ఇటీవల పూర్తి చేశాం . గ్రీజింగ్, ఆయిల్ మార్చటం వంటి పనులు నిర్వహించాం. ప్రాజెక్టు వద్ద సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరిస్తున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ, మూసీ ప్రాజెక్టు

ఆర్టీసీ బస్టాండ్‌లో కుప్పకూలి వృద్ధురాలి మృతి



కమిలి (ఫైల్)

కొండమల్లేపల్లి : ఆర్టీసీ బస్టాండ్‌లో కుప్పకూలి ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవూర మండలం పొట్లపల్లి సమీపంలో గల గేమియానాయక్‌తండాకు చెందిన బాణావత్ కమిలి(64) హైదరాబాద్‌లోని వస్థలిపురంలో స్పోర్ట్స్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న కుమారుడి ఇంటికి వారం రోజుల క్రితం వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం సొంత ఊరు గేమియానాయక్‌తండాకు బయల్దేరింది. పెద్దగుమ్మడం బస్సు ఎక్కడానికి కొండమల్లేపల్లిలోని బస్టాండులో దిగింది. తన చేతిలో ఉన్న రెండు సంచులను బస్టాండులోని బెంచిపై పెట్టి కూర్చుబోతూ కిందపడిపోయింది. గమనించిన తోటి ప్రయాణికులు, కంట్రోలర్ బుచ్చి బాబు 108కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపే కమిలి మృతిచెందింది. షుగర్‌తో పాటు వడదెబ్బకు గురికావడం, ఆపై గుండెపోటు రావడంతో మృతిచెందిందని భావిస్తున్నారు. కమిలి మరణ వార్త తెలుసుకొని ఘటనాస్థలానికి వచ్చిన కుటుంబ సభ్యుల రోదనలు చూపరులను కంటతడిపెట్టించాయి.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం



శివ (ఫైల్)

ఆలేరురూరల్ : వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆలేరు, వలిగొండ, బీబీనగర్ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన గంధమల్ల శివ(21) ట్రాలీ ఆటోలో ఇసుక విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శివ సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటినుంచి బయటికి వెళ్లాడు. కాగా, పటేల్‌గూడెం వెళ్లే దారిలోని ముత్యాలమ్మగుడి సమీపంలో వాగు ఒడ్డున కానుగు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట శ్రీను తెలిపారు.

ఆర్థిక సమస్యలతో..



మణి ప్రకాష్ (ఫైల్)

వలిగొండ : మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన బుగ్గ మణిప్రకాష్ (22) హైదరాబాద్‌లో వ్యాపారం చేసి ఆర్థికంగా చితికిపోయాడు.ప్రకాష్ చేసిన అప్పులను తండ్రి బుగ్గ నాగరాజు చెల్లించాడు. దీంతో మణిప్రకాష్ స్వగ్రామానికి చేరుకున్నాడు. ఆదివారం తల్లితండ్రులు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న మణిప్రకాష్ మనస్తాపంతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పురుగుల మందు తాగి అక్కడే చెట్టుకు ఉరేసుకున్నాడు.అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

రైలు కిందపడి..



చరణ్‌తేజ్ (ఫైల్)

బీబీనగర్: రైలు కిందపడి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని కొండమడుగు మెట్టు వద్ద ఆదివారం వెలుగులోకి వచ్చింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ఏదులబాద్ గ్రామానికి చెందిన రాచకట్ల చరణ్‌తేజ్(23) రామాంతాపూర్‌లోని కాల్‌సెంటర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, తన అర్హతకు తగిన ఉద్యోగం దొరకడం లేదని చరణ్‌తేజ్ కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే శని వారం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. అదే రోజు రాత్రి కొండమడుగు మెట్టు వద్దకు చేరుకున్నాడు. స్థానిక సర్వీస్ రోడ్డులో బైక్‌ను పెట్టి పక్కనే గల రైల్వే పట్టాలపైకి వచ్చి గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున స్థానికులు మృతదేహాన్ని గమనించి ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా చరణ్‌తేజ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఎక్కడి నుంచి పోటీ అనేది ఇంకా నిర్ణయించుకోలేదు

- గుత్తా అమిత్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా అమిత్‌రెడ్డి

చౌటుప్పల్ : రాజకీయ ప్రవేశం చేయాలని నిర్ణయించుకున్నానని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. అయితే జిల్లాలో ఎక్కడి నుంచి పోటీ చేయాలి అనేది మాత్రం ఇంకా నిర్ణయించుకోలేదన్నారు. పార్టీ అధిష్టానం సూచనలకు కట్టుబడి ఉంటానన్నారు. చౌటుప్పల్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ట్రస్ట్ ద్వారా జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు మరింత చేరువ కావాలన్న లక్ష్యంతో రాజకీయాల్లోకి రావాలని భావిస్తున్నానని తెలిపారు. జిల్లాలోని మునుగోడు, నల్లగొండలలో ఎక్కడి నుంచి పోటీ చేయాలన్న విషయం మరో రెండు మూడు నెలల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ఫలానా చోటు నుంచి, ఫలానా బాధ్యతలు కావాలని తాను కోరుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ, మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డిల నాయకత్వంలో తనకు ఏ బాధ్యత అప్పగించినా అంకితభావంతో పని చేస్తానన్నారు. మునుగోడు నియోజకవర్గానికి తమ కుటుంబానికి దగ్గరి సంబంధం ఉందన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

చౌటుప్పల్ : ఇంటి వరండాలో నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగలు లాక్కెళ్లారు. ఈ ఘటన మండల పరిధిలోని మసీదుగూడెం గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిసాటి నర్సిరెడ్డి, ఆయన భార్య సులోచన కలిసి రోజువారీ మాదిరిగానే శనివారం సైతం తన ఇంటి ఆవరణలోని వరండాలో నిద్రించారు. ఆ క్రమంలో అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు వరండాలోకి వచ్చారు. సులోచన మెడలో ఉన్న నాలుగున్నర తులాల బరువు గల బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. గొలుసును లాగడంతో సులోచన మెడపై గాయాలయ్యాయి. దొంగలను వెతికినా ప్రయోజనం చేకూరలేదు. ఈ మేరకు నర్సిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



యాదయ్య (ఫైల్)

శాలిగౌరారం : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. శాలిగౌరారం, డిండి, భువనగిరి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. కట్టంగూరు మండలం కురుమర్తి గ్రామానికి చెందిన ఊట్కూరు యాదయ్య(36) భార్య, పిల్లలతో కలిసి నాలుగేళ్లుగా ఆకారంలో నివాసం ఉంటూ వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. యాదయ్య పని నిమిత్తం బైక్‌పై కురుమర్తి గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. మార్గమధ్యలో శాలిగౌరారం మండలం ఆకారం గ్రామశివారులో బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన గుంతలో బోల్తా కొట్టింది. రోడ్డు వెంట వెళ్లే వారు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

బైక్‌ను కారు ఢీకొట్టడంతో..

డిండి: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం ఉమ్మాపూర్ గ్రామానికి చెందిన కొత్తూరి బాలింగయ్య(60) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. డిండి మండల కేంద్రంలో ఆదివారం కిరాణ సామగ్రి తీసుకొని బైక్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో అదే మార్గం గుండా డిండి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు స్థానిక లిటిల్‌మాస్టర్ స్కూల్ సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న బాలింగయ్య బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని కల్వకుర్తి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ.సైదులు తెలిపారు.

హార్వెస్టర్ ఢీకొని..

భువనగిరి : మండంలోని పచ్చర్లబోడు తండాకు చెందిన గుగ్గులోతు విజయ్(21) వ్యవసాయంతో పాటు కోళ్లఫాం చూసుకుంటు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బంధువులు భూక్య జగన్‌తో కలిసి బైకు మీద మండలంలోని రెడ్డినాయక్ తండా నుంచి పచ్చర్లబోడు తండాకు బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో రెడ్డినాయక్ తండా శివారులో ఎదురుగా వస్తున్న హార్వెస్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్ అక్కడికక్కడే మృతిచెందగా జగన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని భువనగిరి ఆస్పత్రికి అక్కడినుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

గంజాయి విక్రయించే ఏజెంటు అరెస్ట్

చౌటుప్పల్ : వ్యాపారులకు గంజాయిని విక్రయించే ఏజెంటును అరెస్టు చేశామని చౌటుప్పల్ ఏసీపీ నూకల ఉదయ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం వద్ద వాహనాల తనిఖీల్లో రూ.42.15 లక్షల విలువైన గంజాయి పట్టుబడిన కేసులో ఒడిశా రాష్ట్రానికి చెందిన శుక్ర ఖిల్లా(23) ప్రధాన ఏజెంటుగా ఉన్నాడని తెలిపారు. అతన్ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బృందం ఒడిశా వెళ్లి అదుపులోకి తీసుకుందని తెలిపారు. ఐదుగురు నిందితుల్లో ఇప్పటికే నలుగురుని అరెస్టు చేయగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే చెందిన రాంబాబును అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆలేరురూరల్ : టాటాఏస్‌లో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఆలేరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటశ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు మండలంలోని కందిగడ్డతండా ప్రాంతానికి చెందిన మాలోతు శివాజీ, కేతావత్ హరీష్ గ్రామాల్లో తక్కువ ధరకు 15 టన్నుల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. ఆ బియ్యాన్ని వేరే ప్రాంతాలకు టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దీంతో తనిఖీలు చేపట్టి వాహనంలోని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన దంపతుల అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం, అంత్యక్రియలకు హాజరైన బంధువులు, గ్రామస్తులు

పెన్‌పహాడ్ : రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం నార్సింగి పరిధిలోని జాన్వాడలో శనివారం భార్యను హత్య చేసి ఆపై తానూ బలవన్మరణానికి పాల్పడిన పెన్‌పహాడ్ మండలంలోని యర్కచర్ల నాగరాజు–సుధారాణి దంపతుల అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో ముగిశాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అనాజిపురానికి తీసుకువచ్చి దహనసంస్కారాలు పూర్తి చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన చిన్నారుల దీనస్థితి చూసి అంత్యక్రియలకు హాజరైన వారంతా కంటతడి పెట్టుకున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మండల పరిధిలోని అనాజిపురం గ్రామానికి చెందిన యర్కచర్ల నాగరాజు–సుధారాణి దంపతుల మృతదేహాలకు ఎంపీపీ నెమ్మాది భిక్షం, మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూముల సురేష్‌రావులు వేర్వేరుగానివాళ్లులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్‌లు చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, షేక్ షరీపుద్దీన్, అనంతుల శ్రీనివాస్‌గౌడ్, నర్సయ్య, సైదులు పాల్గొన్నారు.

ఎన్‌సీఎల్ పరిశ్రమలో కార్మికుడి మృతి

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులోని ఎన్‌సీఎల్ డోర్ల తయారీ పరిశ్రమలో ఆదివారం ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన పది మంది కార్మికులు ఎన్‌సీఎల్ పరిశ్రమలో పనిచేసే నిమిత్తం శనివారం వచ్చారు. వచ్చిన మరుసటి రోజునే పనిలో చేరిన నరేష్ మండల్(34) పరిశ్రమలోని డస్ట్‌బౌల్‌లోని బ్యాగ్ ఫిల్టర్‌ను శుభ్రం చేసేందుకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న క్రమంలో డస్ట్ బౌల్‌లో నిల్వ ఉన్న వేస్టేజ్ ఒక్కసారిగా అతనిపై పడింది. దీంతో ఊపిరి ఆడకపోవడంతో తీవ్రంగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు కార్మికుడు మృతిచెందినట్టుగా నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని ఎస్ఐ సీత పాండు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాలకు వైద్యసేవలు విస్తరించాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



దంత వైద్యశాలను ప్రారంభిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ : గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు విస్తరించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయి మంచికంటి దంత వైద్యశాలను ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. మెరుగైన వైద్యంతోనే గ్రామాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఎన్నో మండలాలకు కూడలిగా ఉన్న చౌటుప్పల్‌లో అత్యాధునికమైన దంత వైద్యశాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అందుబాటులోకి వస్తున్న ఆస్పత్రులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు సైతం సేవా కోణంలో ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్, సింగిల్‌విండో చైర్మన్‌లు వెన్‌రెడ్డి రాజు, చింతల దామోదర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంచికంటి భాస్కర్‌గుప్త–ప్రమీల, ఆసుపత్రి నిర్వాహకులు మంచికంటి వెంకటేష్, మంచికంటి రాజేశ్వరి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, కంది లక్ష్మారెడ్డి, డాకోజి లక్ష్మీనారాయణ, దూడల భిక్షంగౌడ్, ఉబ్బు వెంకటయ్య, పోలోజు శ్రీధర్‌బాబు, బండమీది మల్లేష్, ఎండీ.బాబాషరీఫ్, ఆలె నాగరాజు, కామిశెట్టి శైలజ, అరుణ్‌కుమార్, రాజు, బాలకృష్ణ, పరమేష్, సతీష్, ఇంద్రసేనారెడ్డి తదితరులు ఉన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హత్య కేసులో కీలక మలుపు

- కట్టుకున్నోడే నిందితుడని అనుమానాలు
- కోదాడలో ముగిసిన రాధ అంత్యక్రియలు
- వెంటనే భర్తను అదుపులోకి తీసుకున్న ప్రకాశం జిల్లా పోలీసులు



కుమారుడితో రాధ (ఫైల్)

కోదాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా వెనిగండ్లపాడు మండలం జిల్లేడుపాడులో ఇటీవల జరిగిన కోదాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, వివాహిత కోట రాధ (35) హత్య కేసు కీలక మలుపు తిరుగుతోంది. ఇప్పటి వరకు రాధ స్నేహితుడే ఘాతుకానికి ఒడిగట్టాడని ఆరోపణలు వచ్చాయి. అయితే, కేసులో ప్రధాన సూత్రధారి ఆమె భర్త కోట మోహన్‌రెడ్డిగా పోలీసులు అనుమానిస్తున్నారు. శనివారం కోదాడలో రాధ అంత్యక్రియలు పూర్తికాగానే ప్రకాశం జిల్లా పోలీసులు మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని వెళ్లారు.

40సంవత్సరాల క్రితమే..

ప్రకాశం జిల్లాకు చెందిన కోట కృష్ణారెడ్డి–కోటేశ్వరమ్మ దంపతులు 40సంవత్సరాల క్రితం ప్రకాశం జిల్లా నుంచి నడిగూడెం మండలం తెల్లబల్లి గ్రామానికి వలస వచ్చారు. కృష్ణారెడ్డి నిర్మాణపనుల మేస్త్రీగా పనిచేసేవాడు. ఇతనికి ఇద్దరు కొడుకులు మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి. వీరు 5వ తరగతి వరకు తెల్లబెల్లిలోనే చదువుకున్నారు. ఆ తరువాత కోదాడకు వచ్చారు. ప్రస్తుతం రామిరెడ్డిపాలెం రోడ్డులో ఉన్న ఎంఎస్ నగర్‌లో సొంత ఇల్లు నిర్మాణం చేసుకొని కృష్ణారెడ్డి–కోటేశ్వరమ్మలు ఉంటున్నారు. పెద్ద కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించగా చిన్న కుమారుడైన మోహన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ప్రకాశం జిల్లాకు చెందిన రాధను పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. సెలవులకు కోదాడకు అప్పుడప్పుడు వచ్చేవారు. వీరికి 8, 5 సంవత్సరాల వయస్సున్న ఇద్దరు కుమారులున్నారు.

దంపతుల మధ్య చిచ్చురేపిన అప్పు

కోట రాధ ప్రకాశం జిల్లాలో చదువుకొనే సమయంలో అదే గ్రామానికి చెందిన కేతిరెడ్డి కాశిరెడ్డి క్లాస్‌మేట్. ఇతను కూడా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. కొన్ని కారణాల వల్ల ఉద్యోగం పోవడంతో కొత్తగా కంపెనీ పెడుతున్నానని అందుకు పెట్టుబడి కొంత సాయం చేయమని స్నేహితురాలైన రాధను కోరాడు. దీంతో ఆమె భర్తకు చెప్పి అతనికి రూ.80 లక్షలు అప్పుగా ఇప్పించినట్లు బంధువులు అంటున్నారు. కానీ కాశిరెడ్డి అప్పుతీర్చక పోవడంతో మోహన్‌రెడ్డి, రాధ దంపతులు దీనిపై తరచు గొడవ పడేవారు. కాశిరెడ్డికి ఇచ్చిన డబ్బుల విషయంలో రాధ గట్టిగా అడగక పోవడంతో వారి సఖ్యతపై మోహన్‌రెడ్డి అనుమానం పెంచుకొని పథకం ప్రకారమే హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమెను అంతమొందించాలని ముందస్తు పథకం ప్రకారమే ఈ దారుణానికి పాల్పడ్డాడని ప్రకాశం జిల్లా పోలీసులు అంటున్నారు.

సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా..

అప్పుతీసుకున్న కాశిరెడ్డిని కేసులో ఇరికించాలని తెలివిగా మోహన్‌రెడ్డి అతని పేరు మీద సిమ్‌కార్డులను తీసుకొని రాధకు మెసేజ్‌లు పెట్టి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. రాధ సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లు పరిశీలించిన పోలీసులకు అవి హైదరాబాద్ నుంచి వచ్చినట్లు తెలుసుకున్నారు. అదే సమయంలో కాశిరెడ్డి బెంగళూరులో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు మోహన్‌రెడ్డిపై దృష్టిపెట్టి విచారించడంతో అతను నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం. శనివారం కోదాడలో రాధ అంత్యక్రియలు నిర్వహించారు. అవి పూర్తికాగానే అక్కడి పోలీసులు మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని ప్రకాశం జిల్లాకు తరలించారు.

క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం నియోజకవర్గ బాధ్యుడు గొడిచెర్ల సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కొమ్ము లక్ష్మి, గౌరవ అధ్యక్షుడిగా మెంట ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా డి.లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా పందుల యాదగిరి, కార్యదర్శులుగా అండాలు, రాములు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి, కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, బి.కళ్యాణ్‌చక్రవర్తి, కూరెళ్ల కుమారస్వామి, బందెల శ్రీను, పవన్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ..

చౌటుప్పల్ : మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ నూతన కమిటీని ఆదివారం మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రవణ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఊదరి భాస్కర్, ఉపాధ్యక్షుడిగా ఎర్రగుంట బాబు, ప్రధానకార్యదర్శిగా ఎర్రగుంట స్వామి, కోశాధికారిగా ఊదరి శేఖర్, సహాయకార్యదర్శిగా ఎర్రగుంట శ్రీకాంత్, సభ్యులుగా బొడ్డు పరమేష్, బొడ్డు గణేష్, గడ్డం అశోక్, రామకృష్ణ, గౌతమ్, శ్రీధర్, హరికృష్ణ, వినోద్‌కుమార్‌లను ఎన్నికయ్యారు.

సదస్సును జయప్రదం చేయాలి

భువనగిరి : ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ కోరారు. ఆదివారం మండలంలోని హన్మాపురం గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో కలిసి మాట్లాడారు. అనంతరం సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో దయ్యాల నర్సింహ, ఎల్లయ్య,పద్మ, మమత, అనుసూర్య, అండాలు, వరమ్మ, సుజాత పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

భూదాన్‌పోచంపల్లి : మున్సిపల్ పరిధిలో గల ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని పరిరక్షించాలని చేనేత టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ భూదానోద్యమం, మరోవైపు చేనేత కళ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన భూదాన్ పోచంపల్లిలో కొందరూ స్వార్థపరులు ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ ప్రజల సంపదను కొల్లగొట్టడం బాధకరమన్నారు. పట్టణ కేంద్రంలో ప్రభుత్వ స్థలం లేక బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మున్సిపల్ భూముల అన్యాక్రాంతంలో ఎలాంటి సంబంధంలేని స్థానిక ఎమ్మెల్యేను బద్నాం చే యడం సరైంది కాదన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై విచారణ జరిపించి వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

దళితబంధు అమలులో ప్రభుత్వం విఫలం

యాదగిరిగుట్ట : దళితబంధు పథకం అమలులో ప్రభుత్వం విఫలమైందని మాదిగ జర్నలిస్టు ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు సుంచు అశోక్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. తుంగతుర్తిలో ప్రజల విశ్వాసం కోల్పోయి అసహనంతో ఉన్న ఎమ్మెల్యే కిశోర్ ప్రజల కోసం పోరాడుతున్న నాయకులను అవమానపరుస్తున్నారన్నారు.

బహిరంగ క్షమాపణలు చెప్పాలి

ఆత్మకూరు(ఎం) : ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకులను అవమాన పరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గాదరి కిశోర్ కుమార్ బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పైన ఉన్న పాత గ్రామపంచాయతీ భవన ప్రాంగణంలో నిర్మిస్తున్న మున్సిపల్ సమావేశ మందిర పనులను ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనులు పూర్తయితే కౌన్సిల్ సమావేశాలకు ఇబ్బందులు తొలిగిపోతాయన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ ఎండి.బాబాషరీఫ్, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, గిర్కటి నిరంజన్, తాడూరి పరమేష్, తొర్పునూరి నర్సింహ, వెంకటేష్ పాల్గొన్నారు.

‘భూ ఆక్రమణలు నిరూపిస్తా’

భూదాన్‌పోచంపల్లి : మున్సిపల్ పరిధిలోని శ్రీమిత్ర సాయిసాధ వెంచర్‌లో జరిగిన భూ ఆక్రమణలను తగిన ఆధారాలతో నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని బీఆర్ఎస్ నాయకుడు కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై చేసిన అభియోగాలను ఖండించారు.

యువత కృషి.. దాతల సహకారం

- కూరెళ్లలో గ్రంథాలయం ఏర్పాటు
- అందుబాటులో దినపత్రికలు, పోటీ పరీక్షల మెటీరియల్
- నిరుద్యోగులకు ఉపయోగం



దిన పత్రికలు, పుస్తకాలు చదువుతున్న పాఠకులు



గ్రంథాలయానికి సమకూర్చిన పుస్తకాలు

ఆత్మకూరు(ఎం): ప్రస్తుతం పోటీ పరీక్షల కాలం. ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు వ్యయ ప్రయాసలకోర్చి వివిధ ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. రీడింగ్ రూంలకు నెలనెలా అద్దె చెల్లిస్తూ ప్రిపేర్ అవుతున్నారు. వీరి సౌకర్యార్థం ఆ గ్రామ యువకులు దాతల సహకారంతో స్థానికంగానే గ్రంథాలయం ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతో పాటు దినపత్రికలను అందుబాటులో ఉంచుతున్నారు.. ఆత్మకూర్(ఎం) మండలానికి చెందిన కూరెళ్ల యువత.

గ్రంథాలయ ఏర్పాటు ఇలా..

కూరెళ్ల గ్రామంలో సుమారు 2500 జనాభా ఉంది. అందులో 1,150 వరకు యువత ఉంది. పోటీ పరీక్షల నేపథ్యంలో గ్రామంలోని నిరుద్యోగుల కోసం గ్రంథాలయం ప్రాధాన్యతను గుర్తించారు. సర్పంచ్ భాషబోయిన ఉప్పలయ్య యాదవ్ ఆధ్వర్యంలో యువకులంతా కలిసి గ్రామానికి చెందిన డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, దాతల సహకారంతో పంచాయతీ భవనంలో అక్షర భారతి పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. లక్ష రూపాయలతో ఫర్నిచర్, పుస్తకాలు సమకూర్చారు. గత నెల 6న దాశరథి అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్య, డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి చేతుల మీదుగా గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రంథాలయంలో దినపత్రికలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. గ్రంథాలయ నిర్వహణకు కమిటీ ఏర్పాటు చేశారు.

కంప్యూటర్ శిక్షణకు ఏర్పాట్లు..

అక్షర భారతి గ్రంథాలయం ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం తిరిగి పరీక్ష రాయడానికి ట్యూటర్లను నియమించి ట్యూషన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంతోషంగా ఉంది



“గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. నిరుద్యోగులకు ఎంతో ఉపయోపడుతుంది. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలి.

–భాషబోయిన లింగస్వామి, పాఠకుడు

నిధులు మంజూరు చేయాలి



“దాతల సహకారంతో గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేశాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అవసరమైన మెటీరియల్ అందజేయాలి. దాతలు మోతె పిచ్చిరెడ్డి, సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్యకు కృతజ్ఞతలు .

– కూరెళ్ల రమేష్, గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు

సద్వినియోగం చేసుకోవాలి



“గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలి. గ్రంథాలయం అభివృద్ధి తనవంతు కృషి చేస్తాను. ప్రతి గ్రామంలో కూడా గ్రంథాలయం ఏర్పాటు చేసుకుంటే నిరుద్యోగులకు ఉపయోగంగా ఉంటుంది.

– మోతె పిచ్చిరెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



ఆలేరురూరల్ : కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్

ఆలేరురూరల్ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని శారాజీపేట, గొలనుకొండ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, మిల్లర్ల తీరుతో ధాన్యం కొనుగోళ్ల మందకొడిగా సాగుతున్నాయని ఆరోపించారు. కాంటా వేసిన వడ్లను మిల్లర్లు కొర్రీలు పెడుతూ దిగుమతి చేసుకోకపోవడంతో కొనుగోళ్లపై ప్రభావం పడుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు లారీల కొరతతో కల్లాలోనే మూలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూసరి రాఘవేంద్ర, రవి, కిష్టయ్య, యాదగిరి, రైతులు యాకయ్య, వీరయ్య, విజయ, పుష్ప, పోచయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్సీ ఎల్. రమణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న చేనేత నాయకులు

భూదాన్‌పోచంపల్లి : చేనేత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోచంపల్లి చేనేత నాయకులు ఆదివారం ఆదివారం ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద భాస్కర్‌ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. చేనేత సహకార సంఘంపై 51జీఓ విచారణను త్వరితగతిన పూర్తి చేసి నామిటెడ్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. చేనేత కార్మికులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని.. పోచంపల్లిలో నిర్మించిన వినోబాభావే మందిరాన్ని సీఎం కేసీఆర్‌చే ప్రారంభోత్సవం చేయించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, మాజీ సర్పంచ్ నోముల గణేశ్, కర్నాటి అంజమ్మ, ఏలే భిక్షపతి, చేనేత జన సమాఖ్య రాష్ట్ర నాయకుడు చింతకింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, వేశాల మురళి, ఏర్వ నీలమ్మ, చింతకింది సత్తయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోత్కూరు : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



యాదగిరిగుట్ట : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరానికి చెందిన 7వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వీరారెడ్డి, ఉపాధ్యాయులు యుగేంధర్‌రెడ్డి, స్వామిరాయుడు, వెంకటాచారి, వై.నర్సిరెడ్డి, సోమయ్య, రాములు, పూర్వ విద్యార్థులు పంజాల మహేందర్, ఝాన్సీ, దయ్యాల నర్సయ్య, సతీష్, నరేష్, రాజిరెడ్డి, సైదులు, మహేందర్, నరేందర్, శ్వేత, సునీత, స్వాతి, సుమలత, విజయ, అనిత పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని మాసాయిపేట గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల 1997–98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజిరెడ్డి, మల్లేశం, గోదాదేవి, విజయలక్ష్మీ, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



శ్రీధర్‌రెడ్డికి సంఘీభావం తెలుపుతున్న ఆయన స్నేహితులు

మోత్కూరు : మోత్కూరు మున్సిపాల్టీ పరిధి కొండగడప నుంచి వెళ్తున్న బిక్కేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, చెక్ డ్యాం నిర్మించాలని కోరుతూ గ్రామానికి చెందిన కొప్పుల శ్రీధర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఆదివారం రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిక్కేలో వాగులో చెక్ డ్యాం నిర్మించడం వల్ల నీటి వృథాను అరికట్టవచ్చన్నారు. వాగు పరిధిలో సుమారు 400 వ్యవసాయ బోర్లు ఉంటాయని, వాటిలో నీటి మట్టం వృద్ధి చెందుతుందన్నారు. అలాగే వాగులో నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, దీంతో భవిష్యత్‌లో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందన్నారు. వాగులో చెక్‌డ్యాం నిర్మించడంతో పాటు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. కాగా వివిధ రంగాల్లో పని చేస్తున్న అతని స్నేహితులు శ్రీధర్‌రెడ్డి దీక్షకు సంఘీభావం తెలిపారు. దీక్షకు సంఘీభావం తెలిపిన వారిలో వీరమల్ల రంజిత్‌కుమార్, ఐతె కిరణ్‌కుమార్, రోకుల రాము, లక్ష్మణ్, బండి బలరామకృష్ణ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు, మాజీ సర్పంచ్ యాదయ్య, అంబటి విజయ్‌కుమార్, రమేష్, సోమయ్య, తొంట పరశురాములు, మల్లయ్య, కారుపోతుల శ్రీను, లెంకల సత్తయ్య, అంబటి లక్ష్మయ్య ఉన్నారు.

యాదవ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన



భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

భువనగిరి : పట్టణంలోని 12వ వార్డులో గల తాతానగర్‌లో శ్రీ కృష్ణ యాదవ సంఘం భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం రాయగిరిలో కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కిష్టయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాండు, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం

మోత్కూరు : పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆదివారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ బాధ్యులు గొడిచర్ల సత్యనారాయణ, నాయకులు మెంట ఎల్లయ్య, కొమ్ము సోమయ్య, లింగమ్మ, పందుల యాదగిరి, నల్ల అండాలు, రాములు, భిక్షం, వెంకన్న పాల్గొన్నారు.

వాటర్‌క్యాన్ల పంపిణీ

తుర్కపల్లి: మండలంలోని మల్కాపూర్‌లో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంచినీటి క్యాన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొన్నాయిల రఘు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషిచేయాలి

మోత్కూరు : బీఆర్ఎస్ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బి.కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని గాంధీనగర్ ఎస్సీ కాలనీలో 5వ బూత్ స్థాయి కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవసారి ఎమ్మెల్యే కిషోర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. సమావేశంలో కుమారస్వామి, శ్రీను, మహేష్, సైదులు, పెద్దులు, నగేష్, రాములు, అయిలయ్య పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు

భువనగిరి : జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించనున్నారు. ఇప్పటి వరకు కిసాన్ నగర్‌లోని అద్దె భవనంలో కొనసాగుతున్న రిజిస్ట్రార్ కార్యాలయ కలాపాలు సోమవారం నుంచి పాత మున్సిపల్ భవనంలో కొనసాగనున్నాయి. భువనగిరి పట్టణం, మండలంతో పాటు బొమ్మల రామారం, తుర్కపల్లి మండలాల ప్రజలు గమనించాలని సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ కోరారు.

ఆర్థికసాయం అందజేత

గుండాల : మండలంలోని రామారం గ్రామానికి చెందిన బీసు పెంటయ్య గౌడ్ ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి జారి పడి గాయాల పాలయ్యాడు. తాడి కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.15 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు గౌడ్, మల్లేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మల్లయ్య , అవిలయ్య ఉన్నారు.

వలిగొండ : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సలీం కుమార్తె అఫ్రీన్‌కు రైతు బంధు సమితి కన్వీనర్ పనుమటి మమత నరేందర్‌రెడ్డి రూ. 35 వేల ఆర్థికసాయం అందజేశారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు



భువనగిరిటౌన్ : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చౌటుప్పల్ : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

భువనగిరిటౌన్ : పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్వర్యంలో భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు బీసుకుంట్ల సత్యనారాయణ, నాయకులు రవికుమార్, మజహర్, జహంగీర్, కృష్ణ, సలావుద్దీన్, అవైజ్, ప్రవీణ్, బాలరాజు, వెంకటరమణ, యాదగిరి, నర్సింహ, కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : పట్టణ కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నీలం పద్మ, ఎంఎ ఎజాజ్, నీలం వెంకటస్వామి, జైనుద్దీన్, సంపత్, లోకేష్, కిరణ్, విక్రమ్, ప్రభు, శ్రీను, భాస్కర్, సాయి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య, మండల, పట్టణ అధ్యక్షులు బాలరాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

చౌటుప్పల్ : భారతదేశానికి రాజీవ్‌గాంధీ అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లమల్ల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని రాజీవ్‌స్మారక భవన్‌లో రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, దేవేందర్, ఎంఏ.ఖయ్యూం, నల్ల నర్సింహ, గుండు నర్సింహ, నాగరాజు, శేఖర్, విక్రమ్, విజయ్, నర్సింహ, రవి, దాస్‌రెడ్డి, నర్సింహా రెడ్డి, శంకరయ్య, రాజేష్ ఉన్నారు.

చిన్నకొండూర్ చౌరస్తాలో

పట్టణ కేంద్రంలోని చిన్నకొండూర్ చౌరస్తాలో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయ రామచంద్రం మాట్లాడుతూ రాజీవ్ స్ఫూర్తితో కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకు లింగస్వామిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌కె.జానిబాబు, ఆవుల ఏసు, మల్కాపురం నర్సింహ, వరగంటి రాజేందర్, సామకూర రాజయ్య, బొంగు రమేష్, వర్కాల రాజేందర్, షరీఫ్, ఏజాస్‌పాష, లింగస్వామి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట : రామన్నపేట, వెల్లంకి గ్రామాల్లో ఆదివారం రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకుడు తాటిపాముల శేఖర్‌గౌడ్, మాజీసర్పంచ్ పున్న నరసింహ, సాల్వేరు అశోక్, ఎండీ జమీరొద్దిన్, తాటిపాముల జంగయ్య, దొమ్మాటి లింగారెడ్డి, అయిటిపాముల పెద్దులు, గంజి భాస్కర్, నర్సింహ, మహ్మద్ ఎజాజ్, గుండాల రమేష్, గురుకు శివ, మహ్మద్ జానీ, బట్టి క్రిష్ణమూర్తి, బొడ్డు శంకరయ్య, సలీం, లింగస్వామి, గోవర్ధన్, గాదె నర్సింహ, యాదగిరి నామనంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ, అక్బర్‌అలీ, నర్సింహ, విగ్నేష్, యూసఫ్‌ఖాన్, గోపాల్, రమేష్, వెంకటేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కందడి అనంతరెడ్డి, సర్పంచ్ జెన్నార్లెకోడె నగేష్, నాయకులు పోతగాని మల్లేషం గౌడ్, కట్టెకోల హన్మంతు గౌడ్, సిద్దులు, నోముల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంతో పాటు టేకుల సోమారంలో ఆదివారం రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేడి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాశం సత్తి రెడ్డి, బోళ్ల శ్రీనివాస్, బెలిద నాగేశ్వర్, కంకల కిష్టయ్య, బంతిని సహదేవ్, గరిసె రవి, పల్లెర్ల సుధాకర్ , గంగాపురం సతీష్ , కుందారపు కొమురయ్య ,పల్లెర్ల రాజు , పాలకుర్ల వెంకన్న , రాపోలు శ్రీను పాల్గొన్నారు.

తుర్కపల్లి: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి చాడ భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, పట్లునాయక్, వినోద్‌నాయక్, రమేశ్‌నాయక్, సురేందర్, భూపాల్ రెడ్డి, ఆకుల సతీష్‌కుమార్, రమేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలేరురూరల్ : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనగాం ఉపేందర్‌రెడ్డి



యాదగిరిగుట్ట : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీర్ల అయిలయ్య



ఆత్మకూరు(ఎం) : రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం



రామన్నపేట : బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



తుర్కపల్లి : దత్తాయపల్లిలో చండీహోమం నిర్వహిస్తున్న గ్రామస్తులు

రామన్నపేట : మండలంలోని సర్నేనిగూడెం, అంబబావిగూడెంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలను కనులపండువగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామ దేవతల పండగలు నిర్వహించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, సర్పంచ్ ధర్నె రాణి, ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, ధర్నె భాస్కర్, నర్ర నర్సింహ, ఎడ్ల సురేందర్‌రెడ్డి, ఆవనగంటి మహేష్, ఆవుల శ్రీధర్, నోముల శంకర్, నీల దామోదర్, నర్ర నర్సింహ, రూపని మల్లయ్య, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

మాచన్‌పల్లిలో..

బొమ్మలరామారం : మండలంలోని మాచన్‌పల్లి గ్రామంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, సర్పంచ్ వట్టిపల్లి లక్ష్మి, ఉప సర్పంచ్ వైల నరేందర్ రెడ్డి, దాసరి సూర్య ప్రకాష్ రెడ్డి, తప్పట్ల బాలకృష్ణ, పొట్ట కృష్ణ, వట్టిపల్లి సుదర్శన్, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దత్తాయపల్లిలో..

తుర్కపల్లి: మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం ప్రతిష్ఠామూర్తులకు ప్రతకాల పూజ, మూల మంత్ర విశేషహోమాలు నిర్వహించారు. అనంతరం ఫల,పుష్పదివాసం,హిర్యణాధివాసం, శయ్యాధివాసం, నీరాజనం నిర్వహించి తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెన్నకూచి రాంమోహన్‌శర్మ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యుగేంధర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

మోత్కూరు : మండలంలోని సదర్శాపురం గ్రామానికి చెందిన అడ్వకేట్ పల్రెపాటి యుగేంధర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తీన్మార్ మల్లన్న టీం మండల కోకన్వీనర్ చేడె ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలికితీసిన అడ్వకేట్ యుగేంధర్‌పై దాడి చేయడం దారుణమన్నారు.

యుగేంధర్‌కు పరామర్శ

హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అడ్వకేట్ పల్రెపాటి యుగేంధర్‌ను ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు పరామర్శించారు. యుగేంధర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. దళిత ఎమ్మెల్యేగా ఉండి దొరల పాలన చేస్తూ దళితులపైనే దాడులకు పాల్పడుతున్న కిశోర్ కుమార్‌ను బీఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కరపత్రం ఆవిష్కరణ

మోటకొండూర్: ఈ నెల 31వ తేదీ నుంచి మండల కేంద్రంలో నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలకు సంబంధించి కరపత్రాన్ని ఆదివారం సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుగ్గ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు బీరకాయల మల్లేష్, జంగవెల్లి జహంగీర్, చంద్రమౌళి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.